క్లుప్తంగా

మహానందిలో విశేష పూజలు



మహానందిలో పూజలు చేస్తున్న భక్తులు

మహానంది: దక్షిణామ్నాయ శృంగేరి పీఠాధిపతి, జగద్గురువు భారతీ తీర్థ మహాస్వామి సన్యాసం స్వీకరించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహానందిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుడు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో నామ సంకీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. దేశ వ్యాప్తంగా పూజలు చేస్తున్నట్లు పండితులు చెప్పారు. గురువుల సందేశాలను భక్తులకు వినిపించారు.

మరకత లింగేశ్వరుడికి మహా రుద్రాభిషేకం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన నవగ్రహ దేవాలయాలు, శ్రీగంగా గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామి వారికి శనివారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నాగరాజు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. నవంబర్‌లో నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున పాల్గొంటారని హెచ్ఎం కె.నాగరాజు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడు దేవానంద్, యోగా ఇన్‌స్ట్రక్టర్ షేక్ అక్బర్‌బాషాలను హెచ్ఎం అభినందించారు.

మహానందిలో భక్తుల సందడి



మహానందీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. వీకెండ్ కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

11లోగా పదవ తరగతి ఫీజు చెల్లించాలి

జూపాడుబంగ్లా: 2025 మార్చిలో జరగనున్న పదవతరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ప్రస్తుతం టెన్త్ చదువుతున్న విద్యార్థులు వచ్చే నెల 11తేదీలోగా ఫీజును చెల్లించాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాల విద్యార్థులు రూ.125ల ఫీజును చెల్లించాలన్నారు. గతంలో మూడు సబ్జెక్టుల కంటే అధికంగా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా రూ.125లు ఫీజు చెల్లించాలన్నారు. మూడు కంటే తక్కువ పరీక్షలు రాయదలచిన విద్యార్థులు రూ.110 చెల్లించాలన్నారు. ఒకేషనల్ విద్యార్థులు నిర్ణీత పరీక్ష ఫీజుకంటే అధికంగా రూ.60లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 15ఏళ్లకంటే తక్కువ వయసు ఉన్న విద్యార్థులు రూ.300ల ఫీజు చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80లు చెల్లించాలన్నారు. నవంబర్ 18 నాటికి రూ.50ల అపరాధరుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చునన్నారు. 25తేదీ వరకు రూ.200లు, 30తేదీ వరకు రూ.500ల అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదుట వృద్ధుడు రంగయ్య(75) ఆటో ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు వృద్ధుడు కాలినడకన ఇంటికి వెళ్తున్న సమయంలో ఆటో ఢీ కొట్టింది. తీవ్ర గాయాలకు గురైన వృద్ధుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాత్కాలిక చికిత్సలు చేసిన వైద్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతా అవకతవకలే !

- తేల్చిన సామాజిక తనిఖీ బృందం
- కేసీ కెనాల్‌లో 7 కిలో మీటర్ల వరకు పనులు చేసినట్లు రికార్డులు
- టెక్నికల్ అసిస్టెంట్లు...సామాజిక తనిఖీ బృందం సభ్యుల మధ్య గొడవ



బహిరంగ సభలో వాగ్వాదం చేసుకుంటున్న సామాజిక బృందం సభ్యులు, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు



టెక్నికల్ అసిస్టెంట్లు ఫేక్ ఫొటోలు చూపిస్తున్నారంటూ ఫిర్యాదు చేస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సామాజిక తనిఖీలు ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఎదుట ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ గందరగోళంగా మారింది. పనులు చేయకుండా ఫేక్ ఫొటోలు పెట్టి బిల్లులు కాజేశారని క్వాలిటీ కంట్రోలు అధికారులకు రుజువులతోసహా నివేదిక అందించడంతో ఒకరిపై ఒకరు నీది తప్పు అంటే కాదు నీది తప్పు అంటూ వాదోపవాదాలు చేసుకున్నారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు...ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఇది తప్పు అంటే.... కాదు ఇదే కరెక్ట్ అంటూ వాదులాడారు. కేసీ కెనాల్‌లో నీళ్లు ఉండగా శాతనకోట, అల్లూరు, బిజినవేముల, నాగటూరు, కొణిదేల గ్రామం 7 కిలో మీటర్ల వరకు 28 మీటర్ల వెడల్పు వరకు పనులు చేసినట్లు బిల్లులు డ్రా చేసుకున్నారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఫిర్యాదు చేయడంతో గొడవ చోటు చేసుకుంది. కేసీ కెనాల్ పై భాగంలో మాత్రమే 28 మీటర్ల వెడల్పు ఉంటుందని, కింది భాగంలో కనీసం 10 మీటర్లు కూడా ఉండదని చెప్పినా వినకుండా ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు గొడవ దిగడం ఎంత వరకు సమంజసమని సామాజిక బృందం సభ్యులు నిలదీశారు. 660 మొక్కలు నాటినట్లు రికార్డులు తయారు చేసి నిధులు నొక్కేశారని, కనీసం ఒక్క మొక్క జాడ కూడా కనిపించడం లేదని సామాజిక తనిఖీ బహిరంగ సభలో బృందం సభ్యులు వెల్లడించారు. సుమారు రూ. 10 లక్షల వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు పక్కాదారి పట్టినట్లు తేల్చి చెప్పారు. పాత ఫొటోలు పెట్టి నిధులు కాజేసినట్లు బహిరంగ సభలో తేల్చారు. ఉన్నది ఉన్నట్లు నివేదిక ఇచ్చామని, మాకు ఎవరిపై ఎలాంటి తేడాలు చూపించేది ఉండదని అధికారులకు వివరించారు. బిజినవేముల గ్రామంలో సచివాలయం నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టరు అయిన నాకు బిల్లులు రూ. 32 లక్షలు ఇతరుల బ్యాంక్ ఖాతాకు ఎలా జమ చేస్తారని సిగినేల వెంకటేశ్వర్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ సురేంద్రనాథరెడ్డిని నిలదీశారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నందికొట్కూరు మండలంలో 733 పనులు చేయడం జరిగిందని, రూ. 5,24,56, 484 కూలీలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ. 25,90, 882 మెటీరియల్ కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ కింద 15 పనులకు రూ. 1,94,53,986 ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. పనులు చేయకుండా తప్పుడు రికార్డులు సృష్టించి నిధులు కాజేసినట్లు రుజువైతే విధుల నుంచి తొలగించడం ఖాయమని హెచ్చరించారు. సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీడీ అన్వరాబేగం, జేఓసీ గంగాద్రి, ఏవీఓ షిబారాణి, కోర్సు డైరెక్టర్ ఏసుదాసు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం దేవనూర్ వద్ద నాటుసారా విక్రయిస్తున్న లక్ష్మమ్మను అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. సారా తయారు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రిమినల్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ జప్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కుమారి, పోలీసులు శివన్న, సుధీర్, మధుప్రసాద్, సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్

జూపాడుబంగ్లా: డిప్యూటీ తహసీల్దార్‌గా సత్యదీప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డోన్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న ఈయన్ను 20 రోజుల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో జూపాడుబంగ్లాకు బదిలీ చేశారు. అయితే డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు చేపట్టకుండా ఇప్పటి దాకా సెలవుల్లో ఉన్న ఆయన శనివారం జూపాడుబంగ్లా డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

వెలుగోడు: రీ సర్వే జరిగిన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రేగడ గూడూరులో శనివారం నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి 105 దరఖాస్తులు వచ్చాయన్నారు. విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, కొన్ని సర్వే నంబర్లు రిజిస్టర్లు కావడం లేదనే ఫిర్యాదులు అందాయన్నారు. నవంబర్ 30వ తేదీలోపు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఏఓ రవీంద్ర పాల్, డీటీ చంద్రశేఖర్, మండల సర్వేయర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

సిద్ధాపురంలో 17 అర్జీలు

ఆత్మకూరు: రీ-సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రత్నారాధిక అన్నారు. శనివారం మండలంలోని సిద్ధాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్ కోసం 03, విస్తీర్ణం మార్పునకు 14 సహా మొత్తం 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

గ్రామ సభకు 82 దరఖాస్తులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని చిన్నదేవళాపురం, నారాయణపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామ సభలకు 82 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. భూముల మ్యూటేషన్‌కు 28, జాయింట్ ఎల్‌పీఎం-20, విస్తీర్ణంలో మార్పు- 32, సవరణకు- 02 చొప్పున దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూసమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని తర్తూరు గ్రామంలో సర్పంచ్ పీఎం.నాగిరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం భూసమస్యలను పరిష్కరించేందుకుగాను సమగ్రభూసర్వే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా రైతుల భూములను రీసర్వేచేసి వందేళ్ల నాటి భూరికార్డులను ప్రక్షాళనచేసి సమస్యల్లేకుండా చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా రైతుల పేర్లు, సర్వేనంబర్లు, విస్తీర్ణం ఏమైనా తప్పొప్పులుగా నమోదైనట్లయితే వాటికి చేర్పులు మార్పులు చేసి రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, సర్వేయర్ షాద్‌మాన్ అతీఫ్, రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో శనివారం రీ సర్వే భూ సమస్యలపై తహసీల్దార్ సుభద్రమ్మ గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు లత, రీ సర్వే డీటీ సుప్రియ, మండల సర్వేయర్లు భాస్కర్, కలిముల్లా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సామర్థ్యం పెంపుపై శిక్షణ

నందికొట్కూరు: రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి వ్యవసాయంపై సామర్థ్యంపై అవగాహన పెంచేందుకు తాము అందుబాటులో ఉన్నామని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆత్మభవనంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి వ్యవసాయ సామర్థ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై అవగాహన ఎంతో అవసరమన్నారు. పంటలపై పట్టు ఉంటే రైతులకు మంచి సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో హేమలత, ఏడీఏ విజయశేఖర్, ఏఓలు పీరు నాయక్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏను పరిశీలించిన కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)ని నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి శనివారం సందర్శించారు. ఐటీడీఏ పనితీరుపై ఆరా తీశారు. చెంచు గిరిజనులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు, ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలు పొందిన గిరిజనులకు అందుతున్న సహకారంపై ఇన్‌చార్జ్ పీఓ సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉందని, మరమ్మతులకు నిధులు అవసరమని పీఓ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎం.దాసు, శ్రీశైలండ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, సిబ్బంది ఉన్నారు.

కాలువలో కొట్టుకుపోతున్న గోవును కాపాడిన యువకులు

మహానంది: నీరు తాగేందుకు తెలుగు గంగ కాలువలోకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడిన గోవును యువకులు కాపాడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కృష్ణ నంది వైపు నుంచి తెలుగు గంగ కాలువలో కొట్టుకువస్తున్న గోవును మహానంది సమీపంలోని అయ్యన్న నగర్ వద్ద మహానంది గ్రామానికి చెందిన ఆర్మీ జవాను చిన్ని, కేశవులు గుర్తించారు. కాపాడేందుకు కాలువ వెంట వెళ్తూ గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలోని పాత రైల్వే బ్రిడ్జి వరకు స్థానిక చెంచు యువకులు నిమ్మల గుర్రప్ప, ఈదన్న, మరో వ్యక్తి శ్రీనురెడ్డి సహకారంతో కాలువలో కొట్టుకుపోతున్న ఆవును పట్టుకుని బయటకు తీసుకొచ్చారు. దీంతో స్థానికులు వారిని అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొత్తపల్లి: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసురత్నం పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కొత్తపల్లిలోని సరస్వతి పాఠశాల ఆవరణలో సీపీఎం సీనియర్ నాయకులు సంజీవ రాయుడు అధ్యక్షతన పార్టీ మండల రెండవ మహాసభ నిర్వహించారు. ముందుగా సీపీఎం జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే మండల నాయకులు స్వాములు సమావేశంలో ప్రజా సమస్యల కోసం అమరులైన పలువురికి నివాళులర్పించేందుకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు, ఉపాధి కూలీలు, కార్మికుల సమస్యలపై ఉద్యమించాలన్నారు. మెట్ట భూములకు ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసు, దేవకుమార్, ఏసన్న, జ్ఞానవరం, రాజేష్, గోపాల్, ధర్మరాజు, దినేష్ భరత్, చిన్న స్వామి, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన డీఈఓ జనార్దన్‌రెడ్డి

మహానంది: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు. మహానందీశ్వరుని సన్నిధిలో జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన ఆయనకు ఎంఈఓ రామసుబ్బయ్య, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు స్వీకరించే ముందు స్వామివారి దర్శనానికి వచ్చానని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని ప్రతి పాఠశాలను తనిఖీ చేసి లోటుపాట్లు ఏవైనా ఉంటే సరిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ వసతి గృహాలు తనిఖీ చేసి ఒక రోజు రాత్రి అక్కడే బస చేసి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దర్శనం అనంతరం ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని తదితరులు ఆయనకు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలపాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపాలని సర్పంచ్ వనమాల ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం ఆత్మకూరు ఆర్టీసీ హెడ్‌క్లర్కు మధుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో రిక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదని తెలిపారు. దీంతో కర్నూలుకు రాకపోకలు సాగిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. డీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హెడ్‌క్లర్కు పేర్కొన్నారు.

నాలుగింటిని ఒకే యాప్‌గా మార్చాలి



సీడీపీఓ కోటేశ్వరమ్మకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ జిల్లా నాయకురాళ్లు

నందికొట్కూరు: నాలుగు యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సేబా, కార్యదర్శి నిర్మల డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ కోటేశ్వరమ్మకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు యాప్‌లు ఉండటంతో అంగన్‌వాడీ వర్కర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూసీ పట్టణ అధ్యక్షులు గోపాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మదార్‌బీ, శివలక్ష్మి, శైలజ, జయలక్ష్మి, ప్రసన్న, పద్మావతి, వెంకటరమణ, షాజిదా, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ సాల్ట్‌పై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపల్లి: అయోడిన్ సాల్ట్ ఉపయోగాలపై మండలంలోని పెద్దగుమ్మడాపురం గూడెం గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయోడిన్ సాల్ట్ తీసుకోవడం వల్ల శిశువులకు ఐక్యు లెవెల్ పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా తల్లికి రక్తహీనత రాకుండా నివారించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం గూడెంలో ఇంటింటికీ తిరిగి అయోడిన్ ప్యాకెట్లను తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమా మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మీ, మల్లీశ్వరి బాయి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే జమిలీ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

ఆత్మకూరు: దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రధాని నరేంద్రమోదీ జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ.. దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉందని, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రజలను ఆలోచించనీయకుండా ప్రధాని మోదీ జమిలి ఎన్నికల అంశాన్ని అజెండాగా తీసుకొచ్చారన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు జరపడంతోపాటు ప్రజా ప్రతినిధులను రీకాల్ చేసే హక్కు ప్రజలకు ఉండాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మోదీ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాటాలకు పూనుకుంటామని తెలిపారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, ఎస్.స్వాములు, ఎ.సురేంద్ర, ఎస్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా దండోరా వేయించాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

పగిడ్యాల: ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు నెల నెలా తప్పనిసరిగా డీలర్లు దండోరా వేయించాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీలో చాలా వెనుకబడి ఉన్నామని, పెంచేడానికి డీలర్లు కృషి చేయాలన్నారు. ప్రతి నెల డీలర్ల సమావేశం నిర్వహిస్తామని హాజరు కాని డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డుదారులు కర్నూలు, హైదరాబాద్ తదితర పట్టణాల్లో పనుల కోసం వెళ్లారని, అందువల్లే పంపిణీ శాతం మందకొడిగా ఉంటుందని డీలర్లు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన తహసీల్దార్ వరుసగా రెండు నెలలు నిత్యావసర సరుకులు తీసుకోకపోతే కార్డు కోల్పోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద మందులే ఉత్తమం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాల సిబ్బంది

వెలుగోడు: దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద మందులు వాడితే జబ్బులు నయం అవుతాయని ఆయుర్వేద డాక్టర్ నాగరాజు అన్నారు. 9వ జాతీయ ఆయుర్వేద వార్షికోత్సవాల సందర్భంగా శనివారం వెలుగోడు పట్టణంలోని ఎస్ఎన్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల జబ్బులకు ఆయుర్వేద మందులు ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయుర్వేద వైద్య విధానాలను వివరించారు. అనంతరం జూనియర్ కళాశాల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, తెలుగు లెక్చరర్ ఎస్ లింగన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

నందికొట్కూరు: విద్యార్థులు చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దూరమవుతాయని ఎంఈఓ సుభాన్ అన్నారు. శనివారం పట్టణంలోని సంతపేట స్కూల్‌లో డెటాల్, బనెగ స్వస్థ ఇండియా గ్రామాలయ సార్డ్స్ ఆధ్వర్యంలో చేతులు శుభ్రంగా చేసుకోవడంతో వ్యాధులు దూరం అనే అంశంపై విద్యార్థులకు సార్డ్స్ డీపీఎం పుల్లన్న అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి రోజు విద్యార్థులు స్నానం చేసి ఉతికిన దుస్తులు ధరించాలన్నారు. శుభ్రంగా ఉన్నప్పుడే క్రిములు నశించి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని చెప్పారు. బాత్‌రూమ్ వెళ్లిన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

నందికొట్కూరు: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి ఆరోపించారు. శనివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సమస్యలు పరిష్కరించాలంటూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులపై భారం మోపే 21, 31 జీఓలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆటో కార్మికుల సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కారం చేస్తానని చెప్పి నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఆటో కార్మికులకు ప్రమాదబీమా రూ, 15 లక్షలు, సహజ మరణం కింద రూ, 10 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు దాటిన వారందరికీ సామాజిక ఫించన్ రూ. 7 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఆటో కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, శేషన్న, గౌడ్, రవికుమార్, మధు, బాలరాజు, మహనంది, తదితరులు పాల్గొన్నారు.